www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 24 | జనవరి | 2026
పేజీలు : 8

## అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు



2లో

- ఆడపడుచుల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్
- 232 మంది లబ్ధిదారులకు రూ.2.32 కోట్ల ఆర్థికసాయం
- ఎంఎల్ఏ కూనంనేని

# ధన బలమే సమర్థతా..?





-పంచగలిగే వారు, కొనగలిగిన వారి వైపు పార్టీల చూపు
-పంచాయతీ ఎన్నికలు నేర్పిన పాఠం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** డబ్బులు లేని వారు ఎందుకు కొరగారు అన్న సామెత ఇప్పుడు ఎన్నికల్లో బాగా వర్తిస్తుంది. ప్రజాబలం, సీనియారిటీ పార్టీ పట్ల అంకిత భావం, నిస్వార్థం ఇవేవి ఇప్పుడు పరిగణలోకి రావడం లేదు. మీ మంచితనం ఎందుకు పనికి వస్తుంది నాలుగు ఓట్లు తెచ్చిపెడుతుందా అన్న బడా లీడర్ల ప్రశ్నలకు క్షేత్రస్థాయిలో నిబద్ధత గల నేతలు సమాధానం చెప్పలేకపోతున్నారు. బహుశా పంచాయతీ ఎన్నికలు నేర్పిన పాఠం కావచ్చు. కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించండి అంటే ఎంత ఖర్చు చేయగలవు అని ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ మాసంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపు డబ్బుతోనే ముడిపడింది. ప్రజాసేవ, పార్టీ బలం, నిజాయితీ గెలుపును సాధించిపెట్టలేదు. ఓట్ల కొనుగోలులో ఎవరు ముందుంటే, ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారు గెలుపొందారు. డబ్బులు పంపిణీ చేయని సర్పంచ్ అభ్యర్థి లేడంటే అతిశయోక్తి కాదు. ఓటు ధర రూ. 1000 దగ్గర మొదలై రూ.10వేల వరకు కొనసాగింది. పరిమితమైన చోట రూ.10వేలకు పైగా పలికింది. గ్రామాలతో సంబంధం లేని వారు కనీసం ముఖ పరిచయం లేని వారు డబ్బులు వెదజల్లి ప్రజాప్రతినిధులు అయ్యారు. పంచాయతీ ఎన్నికల తర్వాత రాజకీయ పార్టీలు ఆర్థిక స్థోమత కలిగి ఆయా స్థాయిలను బట్టి ఖర్చు చేయగలిగిన వారిని ఎంపిక చేసే పనిలో ఉన్నారు. గెలుపు గుర్రాలంటే వీరే అటువంటి వ్యక్తులకు పార్టీ బలం తోడైతే గెలుపొందడం సులభమన్న భావన రాజకీయ పార్టీలలో బలపడింది. సంపన్నులు కాగానే సరిపోదు పంచగలిగే గుణముందా చేతిలో నగదు ఉందా అని కూడా ఆలోచన చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నగారా

మిగతా 2లో..

### శతాబ్ది ఉత్సవ స్ఫూర్తిని
# కొనసాగిద్దాం

-కలిసి వచ్చే పార్టీలతో మున్సిపల్ 'పొత్తు'
-ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
-సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు గొప్ప పోరాట స్ఫూర్తిని ఇచ్చాయని ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలకు పునరంకితం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. దేశం ఆర్థికంగా ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని, దేశ సంపద కొందరి చేతుల్లో బంధీగా మారుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది

మిగతా 2లో..

## విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత



-ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు
-నిర్వాసితులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు
-అర్బన్ పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్ బాలాజీ నగర్‌లో రూ. 2.43 కోట్లతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్

మిగతా 2లో..

## వైరా మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరాలి



-కాంగ్రెస్‌వి డైవర్షన్ రాజకీయాలు
-ఈ నెల27 నుంచి బాకీ కార్డు ప్రచారం
-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

2లో..

# విజేతను తేల్చేదెవరు..?



-ఏదులాపురంలో మున్సిపల్ ఎన్నికల వేడి
-చర్చల దశలోనే పొత్తులు
-బలమైన పార్టీగా సిపిఐ.. వందేళ్ల వేడుకల జోష్
-గెలుపు గుర్రాల వేటలో పార్టీలు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది. వామపక్షాలకు బలమైన కేంద్రంగా ఉన్న ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఏదులాపురంలో విజేతను తేల్చేదెవరన్న దానిపై ఇప్పుడు జోరుగా చర్చలు సాగుతున్నాయి. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పడటం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజక వర్గం కావడంతో ఈ మున్సిపాలిటీ వైపు అందరి చూపు ఉంది. రెండు మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్న వార్తల నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తుల చర్చలు సాగుతున్నాయి. వార్డుల వారీగా ఏమి తేలకపోయినా బిఆర్ఎస్, సిపిఎంలు ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. కాంగ్రెస్‌తో సిపిఐ

మిగతా 2లో..

# ధన బలమే సమర్థతా..?

**(మొదటిపేజీ తరువాయి)** రెండు మూడు రోజుల్లో మోగుతుందన్న వార్తల నేపథ్యంలో రాజకీయ వేడి మొదలైంది. పార్టీల మధ్య పొత్తుల విషయమై చర్చలు సాగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నేతల చుట్టూ తిరుగుతున్నారు. పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉంది. పార్టీ అధికారంలో ఉండటం, శాసనసభ్యులు ఉన్న చోట ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్న భావనతో కాంగ్రెస్ నాయకుల వద్దకు క్యూ కడుతున్నారు. క్యూలో కూడా వలస పక్షులే అధికంగా ఉన్నారన్న ప్రచారం జరుగుతుంది. దశాబ్దాల తరబడి కాంగ్రెస్ జెండా మోస్తూ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీలో పనిచేసిన వారు ముందు వరుసలో కనిపించడం లేదు. నీరున్న దగ్గరికి తెల్ల కొంగలు బారులు తీరినట్లు అధికారంలో ఉన్న పార్టీ వైపు పరుగులు పెట్టి వారంతా ఇప్పుడు పదవుల వేటలో నాయకులను కాకా పట్టే పనిలో ఉన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఎన్నికల సందర్భంగా ఎక్కడ మచ్చుకు కూడా కానరావడం లేదు. పంచాయతీ వార్డు సభ్యుడు, సర్పంచ్ ఖర్చుకు పరిమితులు విధించారు. లక్షల్లో ఖర్చు పెట్టే వారు వేలల్లో మాత్రమే లెక్కలు చూపుతుంటే వాస్తవాన్ని వదిలి కాగితాలు చూసి అధికారులు సంతృప్తి పడుతున్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రలోభ పర్వం జోరుగానే జరిగే అవకాశం ఉంది. ఎన్నికలంటే ఓటర్లకు డబ్బు పంచడం సాధరణమే నన్న భావన బలపడటంతో పాటు అధికారుల ఉదాసీనత కారణంగా పంపిణీకి అధికార ముద్ర పడుతుంది. గతంలో పోలీసులకు తెలియకుండా ప్రలోభ పర్వం సాగేది. ఇప్పుడు ఎటువంటి పట్టింపులు లేకుండా యధేచ్చగా సాగుతుంది. సర్పంచులే 10 లక్షల నుండి ఆయా పంచాయతీల స్థాయిని బట్టి కోటి రూపాయల వరకు ఖర్చు చేశారంటే మున్సిపల్ ఎన్నికల్లో ఖర్చు ఏ స్థాయిలో ఉంటుందో ఆలోచించుకోవచ్చు. అందుకే గెలుపు గుర్రాలంటే ఖర్చు చేయగలిగిన వారే. అటువంటి వారి ఎంపిక పార్టీ గెలుపుకు దోహదపడుతుంది.

# అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందిస్తామని, పథకాల అమలు పూర్తి పారదర్శకంగా ఉంటుందని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు చెందిన 232 మంది లబ్దిదారులకు సుమారు రూ.2 కోట్ల 32 లక్షల 26,912 విలువల గల కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే దఫాలో ఇంత పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అడపిల్ల పెళ్లి చేసే సమయంలో పేద తల్లిదండ్రులు అప్పుల పాలు కాకుండా ప్రభుత్వం అందిస్తున్న రూ.1 లక్ష116 ఆర్థిక సహాయం కొండంత అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తాము నిరంతరం కృషి చేస్తామని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూసే బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. కేవలం ఒక్క రోజులోనే ఐదు మండలాల ప్రజలకు ఇంత భారీస్థాయిలో నిధులు విడుదల కావడం నియోజకవర్గ చరిత్రలో ఓ రికార్డు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ కమీషనర్ సుజాత, తహశీల్దార్లు పుల్లయ్య, శిరీష, కృష్ణ, కృష్ణ ప్రసాద్, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, యూసుఫ్, తోటరాజు, మాచర్ల శ్రీనివాస్, పొదిలి శ్రీనివాస్, మూడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత






**(మొదటిపేజీ తరువాయి)**
అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రోగాలతో అనేక ఇబ్బందులతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలతో సిబ్బంది ప్రేమ, అప్యాయతలతో ప్రవర్తించాలని మన ప్రవర్తనతో రోగికి సగం బాధ నయమవుతుందన్నారు. ఆసుపత్రి పరిసరాలలో పచ్చని మొక్కలు పెంచాలని, ఆసుపత్రి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్య శాఖకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు కలెక్టర్, కమిషనర్ నిధులు కూడా వెచ్చించి ఆసుపత్రి చుట్టు పక్కల పరిశుభ్రత, పారిశుధ్యం పాటించాలన్నారు. అవసరమైతే ప్రత్యేక అభివృద్ధి నిధులు కూడా కేటాయిస్తామని మంత్రి తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సిబ్బంది యూపిహెచ్‌సి నందు వైద్య సేవల కోసం కేటాయించాలని అవసరమైతే నూతన పోస్టుల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్య, వైద్య అవకాశాలతో ఖమ్మం ప్రశాంత నగరంగా అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్య రంగాలను ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందన్నారు. ఖమ్మం నగరంలో అర్హులైన పేదలకు 2500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని త్వరలో మరో 2,500 ఇండ్ల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రూ.13వేల కోట్లు ఖర్చు చేస్తూ సన్నబియ్యం సరఫరా చేస్తుందని తెలిపారు. ఉచితంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు 6వేల డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేశానని వాటిలో పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేసి రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో నిర్వాసితులకు కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం మార్కెట్ వద్ద రోడ్డుపై నివసిస్తున్న 28 మంది పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించి రోడ్డు విస్తరణ చేశామన్నారు. రోడ్డు విస్తరణలో ఎక్కడైనా భవనాలు కోల్పోతే వారికి పదిరేట్ల పరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేద్దామని అధికారంలో ఉన్న నాయకులు ప్రయత్నించినా అధికారులు ఒప్పుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, స్థానిక కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, ఆర్డివో జి. నర్సింహారావు, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి...

నరగంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రజలు సహకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఖమ్మం నగరం 53వ డివిజన్‌లో రూ.3.98 కోట్లతో చేపట్టనున్న సిసి డ్రైన్, రోడ్డు నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 33 మంది దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. నగరంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, డ్రైనేజీల్లో చెత్తవేయడం ద్వారా నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి దోమలు వ్యాప్తి ప్రజలు రోగాల బారీనపడుతున్నారని మంత్రి తెలిపారు. నగరం పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

# శతాబ్ది ఉత్సవ స్ఫూర్తిని కొనసాగిద్దాం

**(మొదటిపేజీ తరువాయి)**
ఉత్సవాల సందర్భంగా 18న జరిగిన బహిరంగ సభ పార్టీ శ్రేణుల్లో గొప్ప ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఇదే సందర్భంలో జరిగిన జాతీయ స్థాయి సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలుకు పూనుకోవాలని కోరారు. ముఖ్యంగా వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించేందుకు క్షేత్ర స్థాయి నుంచి ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హేమంతరావు తెలిపారు. త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో కలిసి పనిచేస్తామన్నారు. మున్సిపాలిటీలలో తమ బలానికి అనుగుణంగా పోటీ చేస్తామన్నారు. సిపిఐ పోటీకి సంబంధించి సమావేశాలు నిర్వహించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాకు సంబంధించి రాజకీయ పార్టీలు తమను సంప్రదిస్తున్నాయని స్థానిక పరిస్థితులు బలాబలాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని హేమంతరావు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పార్టీకి సంబంధించిన యంత్రాంగమంతా సమ్మె ప్రచారంలో పాల్గొనాలని ఆయన సూచించారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక రైతాంగ విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్పొరేట్ల కోసమే మోడీ పాలన సాగుతుంది తప్ప దేశ ప్రజల కోసం కాదని హేమంతరావు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన బహిరంగ సభ, ప్రదర్శన, తదనంతర కార్యక్రమాల జయప్రదానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది.

# విజేతను తేల్చేదెవరు..?




**(మొదటిపేజీ తరువాయి)**
పొత్తుపై స్పష్టత రాలేదు. ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ బలమైన రాజకీయ పార్టీగా ఉంది. సిపిఐ నిర్ణయం ఈ మున్సిపాలిటీలో విజేతను తేల్చనుంది. నూటికి నూరు శాతం గేమ్ ఛేంజింగ్ సిపిఐ చేతిలోనే ఉండే అవకాశం ఉంది. సిపిఐ ఈ మున్సిపాలిటీలో సంస్థాగతంగా బలమైన రాజకీయ పార్టీగా ఉంది. సొంత బలంతో పలు డివిజన్లలో గెలుపొందడంతో పాటు మరి కొన్ని డివిజన్లలో విజేతను తేల్చే అవకాశం ఉంది. ఇప్పటికే సిపిఐ శత వసంతాల ముగింపు వేడుక సందర్భంగా నిర్వహించిన ప్రదర్శన , బహిరంగ సభ విజయవంతం కావడం ఈ మున్సిపాలిటీ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కదలడంతో ఆ పార్టీలో నూతనోత్తేజం నెలకొంది. కాంగ్రెస్, సిపిఐ మధ్య చర్చలు ఫలించి కలిసి బరిలోకి దిగితే 32 స్థానాల్లో నాలుగైదు స్థానాలు మినహాయించి అన్నింటా గెలుపు ఢంకా మోగించే అవకాశం ఉంది. అయితే పొత్తుపై సందిగ్ధత నెలకొంది. మరో పక్క సిపిఐని కలుపుకుని బిఆర్ఎస్, సిపిఎం కూటమిగా ఏర్పడాలన్న ఆలోచనపై కూడా చర్చలు సాగుతున్నాయి. సిపిఐ ఎటువైపు మొగ్గితే మున్సిపాలిటీలో అధికారాన్ని ఆ కూటమి చేజిక్కించుకునే అవకాశం ఉంది. మొత్తంగా ఏదులాపురం మున్సిపాలిటీలో పొత్తులతో పాటు సిపిఐ నిర్ణయం కూడా అత్యంత కీలకం కానుంది. మరో పక్క ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేశాయి. ఈ కమిటీలలో చర్చించిన తర్వాత అభ్యర్థులను తేల్చే అవకాశం ఉంది. బాధ్యుల పరిశీలనలో వచ్చిన అంశాలను పరిగణలోకి తీసుకుని పార్టీ దృష్టికి అభ్యర్థుల జాబితాను వార్డుల వారీగా ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. మొత్తంగా ఏదులాపురం మున్సిపల్ రాజకీయాలు సిపిఐ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాయి.

## ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సిపిఐ...

ఏదులాపురం మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారాన్ని సిపిఐ ప్రారంభించింది. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేతృత్వంలో వరంగల్ క్రాస్ రోడ్డులోని 28, 29, 30 డివిజన్లలో ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రారంభ సూచికంగా డిబిఆర్ సర్కిల్‌లో సురేష్ జెండా ఊపి సిపిఐకి ఓట్లు వేసి గెలిపించాలని నినదించారు. ఇంటింటికి తిరిగి సిపిఐకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మున్సిపల్ అభివృద్ధి సిపిఐతోనే సాధ్యమని ఈ సందర్భంగా సురేష్ స్పష్టం చేశారు. అన్ని వేళల అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడికంటి చిన్నవెంకటరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఆయా డివిజన్ల కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయి..



**ప్రజాపక్షం/పాల్వంచ :** క్రీడల వలన మానసిన ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం కలుగుతుందని భద్రాచలం ఐటిడిఏ పిఓ బి. రాహుల్ అన్నారు. మండల పరిధి కిన్నెరసాని మోడల్ క్రీడా పాఠశాలలో రెండు రోజుల పాటు ఐటిడిఏ పరిధిలోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల క్రీడలను శుక్రవారం పిఓ ప్రారంభించారు. ఈ సంధర్భంగా టిడిఏ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ అధ్యక్షతన జరిగిన సభలో పిఓ మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు మానసిన ఒత్తిడికి గురి అవుతూ కూడా నిత్యం గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిప్యూటి డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి, ఉమ్మడి ఖమ్మం జిల్లాల ఏసిఎంఓలు రాములు, కే. రమేష్, ఇల్లందు, వైరా, ఖమ్మ, ఏటిడిఓలు. స్పోర్ట్స్ ఆఫీసర్స్ బొల్లి గోపాలరావు, ఏఓలు కే. వెంకటనారాయణ, ఎస్. నాగేశ్వరరావు, బి. రాంబాబు, హెచ్ఎం. చందు, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పూనెం నరసింహరావు, రల్. రవి, విజయలక్ష్మి, నామా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించాలి

**-నా భారతదేశం..నా ఓటు అనే థీమ్‌తో ఓటరు దినోత్సవం**

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పౌరులుగా మన బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని, ప్రస్తుత సంవత్సరం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 23న అధికారులతో ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో కులం, మతం, ప్రాంతం, వర్గం, భాష, పేదరికం, ధనికులు అనే తేడా లేకుండా అందరికి సమానంగా ఓటు హక్కును కల్పించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరిని ముఖ్యంగా యువతను భాగస్వామ్యం చేసే దిశగా ప్రతి ఒక్కరు నిస్వార్థంగా స్వేచ్ఛతో ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు ఈ ఓటరు జాతీయ దినోత్సవాన్ని వినియోగిస్తామన్నారు. ప్రస్తుత సంవత్సరం నా భారతదేశం నా ఓటు అనే థీమ్‌తో జాతీయ ఓటరు దినోత్సవ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో బాధ్యత గల పౌరులుగా దేశ అభ్యున్నతిలో మన భాగస్వామ్యం ఉండాలన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటరు జాబితా సవరణ అయ్యేవిధంగా మార్పు తీసుకు వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉద్యోగులతో కలిసి ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ లోని 29వ డివిజన్‌లోని స్థానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రూ.1లక్షల76వేల విలువగల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. వీటిని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా మంజూరయ్యాయి. మేళ్లచేర్వు రవికి రూ.25వేలు, గన్నవరపు లక్ష్మికి రూ.30వేలు, బుద్ధి శేఖర్ రూ.18వేల500వందలు, బుద్ధి సరస్వతి రూ. 30వేలు, బుద్ధి శేఖర్ రూ.33వేల500 వందలు, కండె సంధ్యారాణి రూ.29వేలు, గువ్వల కృష్ణకు రూ.40వేలు సీఎం ఆర్ఎఫ్ నుంచి లభించాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, మున్సిపాలిటీ నాయకులు దండి రంగారావు, సిపిఐ 28,29,30 డివిజన్ల కార్యదర్శులు వెంపటి రాము, బియ్యాల రాజు, లగిశెట్టి రమేష్, ఆయా డివిజన్ల యువజన సంఘం కార్యదర్శిఅధ్యక్షులు, మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.



# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

**ప్రజాపక్షం/బోనకల్ :** వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన ఉద్యోగులు రిటైర్డ్ అయిన తర్వాత వారికి రావాల్సి బకాయిలు ఏళ్ల తరబడి అందకపోవటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి మధు తెలిపారు. మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు 30 సంవత్సరాల సర్వీస్‌లో దాచుకున్న డబ్బులను కూడా రిటైర్డ్ అయిన తర్వాత అందించకపోతే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగంపైనే ఆధారపడి పనిచేసేవాళ్లు తమ పిల్లల భవిష్యత్, ఆరోగ్య భద్రత కోసం ఎంతో ఆశతో ప్రతినెల డబ్బులు దాచుకోగా ఉద్యోగ విరమణ తర్వాత వాటిని ఇవ్వనందున ఎక్కువమంది ఉద్యోగులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కోర్టుకు వెళ్లిన వారికి మాత్రం బెనిఫిట్స్ అందుతున్నాయని తెలిపారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్స్ అందించేలా తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిఆర్‌పిఎ రాష్ట్ర కార్యదర్శి వెంకటనర్సయ్య, జిల్లా అధ్యక్షులు ఎనమద్ది వెంకటేశ్వర్లు, దాసు తదితరులు పాల్గొన్నారు.



# నర్సింగ్ విద్యార్థినికి సీతారత్నం ట్రస్ట్ చేయూత

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిరుపేద విద్యార్థిని ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా నిలిచింది. వైరా మండలం అష్ణగుర్తికి చెందిన కొమ్మోజు ఏసుబు బాలకుమారి దంపతుల కుమార్తె కవిత నర్సింగ్ చదువు కోసం ఆర్థిక చేయూతనందించాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్‌ను అభ్యర్థించింది. స్పందించిన ట్రస్ట్ నిర్వాహకులు పరిశ పుల్లయ్య సౌజన్యంతో ఖమ్మం నగరానికి చెందిన మచ్చా కోటేశ్వరమ్మ కవితకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చింది. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా శుక్రవారం ఖమ్మం నగరంలోని కృషి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రూ. 20వేల చెక్కును ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య దాత కోటేశ్వరమ్మ చేతుల మీదుగా విద్యార్థిని కవితకు అందజేశారు. అడిగిన వెంటనే స్పందించి ఆర్థిక చేయూతనందించిన ట్రస్ట్ నిర్వాహకులకు కవిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిపిఏటి జిల్లా నాయకులు రాయల రవికుమార్, కనపర్తి నాగప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుని సిహెచ్ విజయలక్ష్మి , మద్దినేని ప్రసాదరావు, బాలకుమారి తదితరులు పాల్గొన్నారు.



# జిపి వర్కర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపిడివో అశోక్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు నిర్విరామంగా సేవలు అందిస్తున్నారన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుడిసి రాజశేఖర్, ఎల్‌డిసి వంశీ, పంచాయతీ కార్యదర్శులు , గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# మరపురాని అభివృద్ధి దిశగా సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలు

**సత్తుపల్లి మున్సిపల్ పరిధిలో 700 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం**

**ఎమ్మెల్యే రాగమయి దయానంద్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** చరిత్రలో లేని విధంగా సత్తుపల్లి, కల్లూరు మున్సి పాలిటీలను అభివృద్ధి చేసి చూపిస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అన్నారు.సత్తుపల్లి పట్టణం వెంగళరావు కాలనీ, రోడ్డు నెంబర్9లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు వర్గుటి సుధాకర్, భాగ్యలక్ష్మి దంపతుల గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డా.మట్టా రాగమయి దయానంద్ పాల్గొని లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావులకు ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో కలిపి సుమారు 700 వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం సొంత ఇంటిని అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలను చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలులో సత్తుపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహరావు, ఇనపనూరి నవీన్,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గృహప్రవేశ వేడుకను విజయవంతం చేశారు.





# ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐలు నరేష్, తేజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఏఐవైఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఫోటోలతో క్యాలెండర్‌ను ముద్రించడం ఎంతో అభినందనీయమన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్, సిపిఐ నాయకులు బానోత్ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మడుపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి 5, 6, 7 వార్డుల్లో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో మడుపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు రూ.22కోట్లు నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. మడుపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సిఎం భట్టికి ప్రత్యేక ధన్యవాదాలు తెలపగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా నారా లోకేష్ 43వ పుట్టినరోజు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ మంత్రి వర్యులు, యువ నాయకులు నారా లోకేష్ 43వ పుట్టినరోజు వేడుకలు టిడిపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్తుపల్లి టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వినుకొండ రమేష్ ఆధ్వర్యంలో సత్తుపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం చేపట్టి, లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోట్రూ రామారావు,పలగాని రమ్య,మల్లూరు మోహన్, రాచర్ల చంద్రశేఖర్, మందపాటి అనిల్ కుమార్ రెడ్డి, తిమ్మిడి రాంబాబు, ఉండవల్లి శ్రీకాంత్, ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.



## క్రషర్‌ను పరిశీలించిన తహశీల్దార్




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లిలో గల క్రషర్‌పై ప్రజాపక్షంలో ఈ నెల 20వ తేదీన అడ్డగోలుగా అక్రమ క్రషర్ అనే కథనానికి తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం క్రషర్ వద్దకు ఆర్ఐ రవికాంత్, సర్వేయర్ సతీష్‌రెడ్డితో కలిసి వెళ్లి అక్కడి పరిస్థితిని కలియతిరిగి పరిశీలించారు. కాగా 5ఎకరాలలో క్రషర్ ఉన్నప్పటికీ 1ఎకరం19గుంటలకు మాత్రమే కన్వర్షన్ ఉండటాన్ని గుర్తించారు. దీనితో పాటు అక్కడ ఉన్న పలు సమస్యలను నివేదికరూపంలో పొందుపరిచి జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ప్రజల సమస్యపై కథనాన్ని ప్రచురించిన ప్రజాపక్షానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్‌గా మున్వర్‌అలీ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీ కమిషనర్‌గా పెద్దతండలోని కార్యాలయంలో మున్వర్‌అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పని చేస్తున్న ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి నల్గొండ జిల్లా హాలీయాకు బదిలీ కాగా తిరుమలగిరి నుంచి బదిలీపై మున్వరఅలీ ఇక్కడకు వచ్చారు.ఈ సందర్భంగా నూతన కమిషనర్‌ను ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదివాసీ సంక్షేమ పరిషత్ కరకగూడెం మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం రాళ్ల వాగు పెద్దమ్మతల్లి గుడి ప్రాంగణంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మణుగూరు డివిజన్ అధ్యక్షులు సోలం హరి శంకర్ అధ్యక్షతన డివిజన్ స్థాయి జరిగిన సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వాగుబోయిన చంద్రయ్య దొర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశం ఉద్దేశించి మాట్లాడుతూ మణుగూరు డివిజన్ పరిధిలో ఉన్న మండలాలలో వన్ 1/70 చట్టం రోజు రోజుకు నీరుగారిపోతుందని అన్నారు. చట్టాన్ని అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యం ధోరణి వహిస్తున్నారు. లంబాడాలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని సంఘం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉద్యమం చేస్తూనే ఉంది. ఇందులో భాగంగా 2011 సంవత్సరంలో హైకోర్టులో లంబాడీలను తొలగించాలని కేసు వేయడం జరిగింది అని గుర్తు చేశారు. అలాగే ఫిబ్రవరి నెలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో గెలుపొందిన ఆదివాసి సర్పంచులను, ఉప సర్పంచులను ఆదివాసి సంక్షేమ పరిషత్ అండ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టబోతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో కరకగూడెం మండలం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా చందా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తొలెం రామారావు, ఉపాధ్యక్షులుగా ఈసం సత్యనారాయణ, కోశాధికారి ఆరెం కృష్ణమూర్తి, కార్యదర్శులుగా గొగ్గల నారాయణ, కోరం రవీందర్, చంద గణేష్, లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి సోలం రామారావు, కార్యదర్శులు ఈసం సూర్య బాబు, వాగుబోయిన శ్రీను, డివిజన్ ఉప అధ్యక్షులు సోలం వెంకట రమణ, మణుగూరు మండల అధ్యక్షులు మడి రమేష్, పినపాక మండల అధ్యక్షులు పడిగా అశోక్, మణుగూరు మండల ఉపాధ్యక్షులు కోండ్రు నాగేందర్, ప్రధాన కార్యదర్శి మడకం ప్రసాద్, కార్యదర్శి గోగ్గాల కోటేశ్, అభ్యుదయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో బిసిల ప్రాధాన్యత పెరగాలి




ప్రజాపక్షం/ఇల్లందు: రాజకీయాలలో బిసిల ప్రాధాన్యత పెరగాలనీ బిసి రిజర్వేషన్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఇల్లందు మున్సిపాలిటీ వార్డుల్లో బహుజనుల జన చైతన్య యాత్ర శుక్రవారం 16,17,18 వార్డులలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బిసిలు రాజకీయ, ఆర్థిక సమానతలు ఎదుర్కొంటున్నారని, వారందరిని చైతన్యం చేసి సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దటమే లక్ష్యమని తెలిపారు. పట్టణ ప్రజలు బిసి రిజర్వేషన్ ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు. ఈకార్యక్రమంలో బిసి సంఘాల జేఏసి ఇల్లందు ఛైర్మన్ దండు రామచందర్, కోడి రాజేందర్, మామిడి శివ, మునాఫ్, కోర్లపాటి కిరణ్, లక్ష్మ ణ్, పలువురు బిసి రిజర్వేషన్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరాలి

-కాంగ్రెస్‌వి డైవర్షన్ రాజకీయాలు
-ఈ నెల27 నుంచి బాకీ కార్డు ప్రచారం
-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్





ప్రజాపక్షం/వైరా: రాష్ట్రంలో సమస్యలను పక్కగా పట్టించేందుకే కాంగ్రెస్ డై వర్షన్ రాజకీయాలు చేస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నా. శుక్రవారం వైరాలో మిట్టపల్లి గార్డెన్‌లో జరిగిన వైరా మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల, పట్టణ అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముందు స్వర్గీయ బానోతు మదన్‌లాల్ మృతి పట్ల మౌనం పాటించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కదో పట్టించడానికి ప్రజల నుండి సమస్యలను డైవర్ట్ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తూ సమస్యలపై పోరాడే వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని, విచారణ పేరుతో గంటల తరబడి ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోబెట్టడమే వారి పని అని, ఇది ప్రజలు గమనిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరంలో పెద్ద ఎత్తున రూ.100కోట్ల అవినీతి జరిగిందని, పదేపదే సంకలు బాదుకునే కాంగ్రెస్ అదే కాళేశ్వరం నుండి హైదరాబాద్‌కు త్రాగునీటిని సరఫరా చేస్తున్న విషయం మరిచిపోయారా అని అడిగారు. కాళేశ్వరం నిర్మాణానికి రూ.90కోట్లు ఖర్చు అయితే రూ.100కోట్లు అవినీతి జరిగిందని చెప్పం హాస్యస్పదంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రశంసలు వర్షం కురిసిందని, నేషనల్ మీడియా కూడా ఈ విషయాన్ని ప్రచురించింది అనే విషయాన్ని గుర్తు చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు ఎక్కడ చేశారని ప్రశ్నించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వరి నాట్లకు రెండు పంటలు వేసేటప్పటికీ రైతుబంధు రైతు అకౌంట్‌లో పడేది, కాని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేయరని అన్నారు. కెటిఆర్‌పై ఈ ఫారాలలో అవినీతి జరిగిందని విచారణ ఫోన్ టాపింగ్‌లో జరిగిందని విచారణ ఎలా కెసిఆర్, కెటిఆర్ హరీష్‌రావులకు విచారణ పేరుతో నోటీసులు ఇచ్చి అడిగిన ప్రశ్నలు అడిగి సాయంత్రం వరకు కూర్చోబెట్టడం తప్ప ఒరిగిందేమి లేదని, ఎక్కడ బిఆర్‌ఎస్ నాయకులు తప్పు చేయలేదని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు మంత్రులు ఎమ్మెల్యేలు స్టాంపు పేపర్లపై సంతకాలు చేశారు. మరీ ఆ సంతకాలు చేసిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క ఒక కార్డును చూపిస్తూ ఈ కార్డు చాలా గొప్పది, ఈ కార్డు మీ వద్ద ఉంటే అన్నింటికి సంబంధించిన డబ్బులు పడిపోతాయని చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆ కార్డు ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ నెల27నుండి వైరా మున్సిపాలిటీలో జాబ్‌కార్డుపై ఇంటింట ప్రకారం నిర్వహించడం జరుగుతుంది. రాజకీయంగా ఎవరైనా బెదిరించిన వేదించిన మీకు నేను అండగా ఉన్నాను. వచ్చి మీ తరుపున పోరాటం చేస్తాను ఎవరో భయపడాల్సిన అవసరం లేదు అని అన్నారు. వైరా మున్సిపాలిటీలో బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి నేటికి ఎవరు మరిచిపోవడం లేదు. బతుకమ్మ ఘాట్ సెంటర్ లైటింగ్, ఇండోర్ స్టేడియం మున్సిపాలిటీలో సిసి రోడ్ల నిర్మాణం, రిజర్వాయర్ ఆనకట్ట అభివృద్ధి, ఇలా చెప్పుకుంటూ పోతే వైరా మున్సిపాలిటీ అభివృద్ధి జరిగింది బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్నారు. త్వరలో జరగనున్న వైరా మున్సిపాలిటీలో గులాబి జెండా ఎగరాలి, కెసిఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలి, ప్రతి కార్యకర్త ఒక సైనికుల్లా పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యురాలు బానోతు చంద్రావతి, బానోతు మంజుల మదన్‌లాల్, లకావత్ గిరిబాబు, ఆర్‌జెపి కృష్ణ, మాజీ సుడా ఛైర్మన్ విజయ్‌కుమార్, కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, పగడాల నాగరాజు, ఎల్లంకి సత్యనారాయణ, పోట్ల శ్రీనివాసరావు, మాదినేని సునీత, దారెల్లి పవిత్ర కుమారి, మిట్టపల్లి కిరణ్‌కుమార్, మేదరమెట్ల రాము, ధనికుల వేణు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, సక్కుబాయి, లాల్‌మహ్మద్, మాదినేని ప్రసాద్, కొత్తా వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, బట్టా భద్రయ్య, నూకల వాసు, తన్నీరు జ్యోతి, వాసిరెడ్డి రవి, వజినేపల్లి చక్రవర్తి, కులాసాగరం నరేష్, తిరుపతి శ్రీను, దామా వీరయ్య, దొంతబోయిన గోపి, ఆదూరి ప్రేమ్‌కుమార్, గుజ్జర్లపూడి దేవరాజ్, పారుపల్లి నాగం, నూకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా రామదాసు జయంతోత్సవాలు

**కళాకారుల కార్యక్రమాలతో మమ అనిపించిన ఉత్సవాలు**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పరమ భక్త గ్రేసరుడు కంచర్ల గోపన్న (భక్తరామదాసు) జయంతి ఉత్సవాలు ప్రారంభం మొక్కుబడిగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా యంత్రాంగం, భద్రాచలం దేవస్థానం, విద్వత్ కళాపీఠం వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు భక్తులు రాక వెలవెలబోయింది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను నిర్వహించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం సృష్టంగా కనిపిస్తుంది. నిర్వహాకుల తీరు పై విమర్శలు ఏకపక్షం నిర్ణయాల వలన భక్తులు రామదాసు ధ్యాన మందిరం వైపు తొంగి చూడటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. తొలి రోజు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పట్టణం లో నగర సంకీర్తన చేశారు. చిన్నారులు వేషధారణ ప్రదర్శనలో ఆకరణ గా నిలిచారు. వివిధ సంఘాల వారు భక్తరామదాసు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మందిరంలో గోమాత పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా కళాకారులు తప్ప ఆశించిన స్థాయి లో భక్తులు రాకపోవటంతో నిర్వహాకులు నిరాశ చెందారు. చివరకు మండల స్థాయి అధికారులు కూడ ఉత్సవాల వైపు తొంగి చూడకపోవటం విశేషం. తొలి రోజు వివిధ ప్రాంతాల కు చెందిన కళాకారులు సాంస్కృతిక ప్రదర్శన లు నిర్వహించారు. మొత్తం మీద కళాప్రదర్శనలతో మమ అనిపించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, నంచర్ల దేవీప్రసాద్, పాలడుగు పూర్ణచందర్ ప్రసాద్, జెర్రిపోతుల అంజిని, నాగుబండి శ్రీనివాసరావు, దోసపాటి కల్పన, కొడిరెక్కల వినోద్, రేగూరి హనుమంతరావు, పసుపులేటి శ్రీలత, రాయపూడి రోహిత్, ఐచ్చలకూరి నాగరాజు, సామాల కోటేశ్వరరావు, కురాకుల ప్రమీలా, ఓరుగంటి నారాయణరావు, యలమద్ది లెనిన్, కడియాల నరేష్, చిలకబత్తిని వీరబాబు, నల్లాని మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# జూలూరుపాడు రేంజ్‌లో ముమ్మరంగా జంతు గణన



ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అఖిలభారత జంతు గణన కార్యక్రమం జూలూరుపాడు అటవీ రేంజ్ లో కొనసాగుతోంది. ఈ జంతు గణన 20వ తారీకు నుండి 25వ తారీకు వరకు ఆరు రోజులు కొనసాగుతుందని జూలూరుపాడు రేంజ్ అధికారి ప్రసాద్ రావు తెలిపారు. ఈ జంతు గణన కార్యక్రమం జూలూరుపాడు రేంజ్ బీట్లలో ఆయా అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ఆరు రోజుల ప్రక్రియలో అటవీ అధికారులు మాంసాహార జంతువులను కాకుండా అన్ని రకాల అటవీ జంతువుల జీవ వైవిధ్యాన్ని సమగ్రంగా రికార్డు చేయనున్నారు. ప్రతి బీటులో జంతువులను, గుర్తించేందుకు అధికారులు కాలినడకన అడవిలో తిరుగుతూ మాంసాహార, శాఖాహార జంతువుల ఆనవాళ్లను గుర్తించడం జరిగిందన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం ఎవరికి దక్కేనో..!











ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేసి చైర్‌పర్సన్ పదవిపై పలువురు నేతలు వారు సతీమణీల కోసం కన్నేశారు. చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీలో హోరాహోరీ పోటీ నెలకొంది. చైర్‌పర్సన్ పదవి కోసం రోజురోజుకు ఆశావాహుల సంఖ్యల పెరిగిపోతుంది. ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. చైర్‌పర్సన్‌కి పోటీపడుతున్న అభ్యర్థుల సంఖ్య రోజుకి పెరుగుతూనే ఉంది. తెరపైకి పలువురు అభ్యర్థులు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. మాజీ జెడ్పిటిసి బొర్రా ఉమాదేవి, పువ్వాళ్ళ ఇందుమతి, ప్రముఖ వైద్యురాలు గైనకాలజిస్ట్ కాపా చంద్రకళ, కొప్పురావూరి ప్రవళిక, యడ్లపల్లి వనజ పేర్లు వినిపిస్తున్నాయి

### బొర్రా ఉమాదేవి

మాజీ జెడ్పిటిసి బొర్రా ఉమాదేవి కుటుంబం వైరాతో రాజకీయంగా ప్రజలతో సంబంధాలు కలిగిన కుటుంబం. స్వర్గీయ బొర్రా వెంకటేశ్వరరావు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ప్రజలకు సేవలు చేసి చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు, బొర్రా ఉమాదేవి, భర్త బొర్రా రాజశేఖర్ రాజకీయాల్లో రాష్ట్రస్థాయి రాజకీయాల్లో ఉన్న వ్యక్తి, నిత్యం ప్రజా సంబంధాలతో ముడిపడిన వ్యక్తి. అలాంటి కుటుంబం నుంచి వైరా మున్సిపాల్ వైరా మున్సిపాల్ చైర్మన్ రేస్‌లో బొర్రా ఉమాదేవి పేరు ప్రజల నుంచి వినిపస్తూ ఉంది.

### పువ్వాళ్ళ ఇందుమతి

పువ్వాళ్ళ ఇందుమతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించి సోమవారం సర్పంచ్‌గా కూడా విధులు నిర్వహించిన పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సతీమణి, కాంగ్రెస్‌లో దుర్గాప్రసాద్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణకు దుర్గాప్రసాద్‌కు అత్యంత సన్నిహితులుగ3ఆ ఉంటూ రాజకీయాన్ని ముందుకు నడుపుతున్నారు.

### డాక్టర్ కాపా చంద్రకళ

డాక్టర్ కాపా చంద్రకళ వైద్యసేవలను గత 20 సంవత్సరాలుగా ప్రజలకు అందిస్తున్నారు. భర్త డాక్టర్ కాపా మురళీకృష్ణ వైద్య సేవలతో పాటు లయన్స్‌క్లబ్ ద్వారా జిల్లావ్యాప్తంగా కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల సమస్యల తెలుసుకొని మేమున్నా మీకు అనే భరోసా ఇచ్చిన సేవా గుణం కలిగిన మురళీకృష్ణ సతీమణి చంద్రకళ తొలిసారి రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు.

### రాంపూడి రాజ్యలక్ష్మి

రాంపూడి రోశయ్య కోడలు రాంపూడి రాజ్యలక్ష్మి చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాంపూడి రోశయ్య ఆది నుంచి నిబద్ధత గల నాయకుడిగా ఉన్నాడు. కష్టకాలంలో కూడా పార్టీని వదిలిపెట్టలేదు. తొలిసారి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

### ముళ్ళపాటి విజయలక్ష్మి

ముళ్ళపాటి వజియలక్ష్మి వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు సతీమణి విజయలక్ష్మి, తొలిసారి మున్సిపాల్ చైర్‌పర్సన్ రేసులో పోటీ పడుతున్నారు. రాజకీయ సమీకరణాలు కలిసి వస్తాయనే విధంగా వారు పావులు కదుపుతూ ఉన్నారు.

### కొప్పురావూరి ప్రవళిక

కొప్పురావూరి ప్రవళి క కొప్పురావూరి సుమంత్ సతీమణి రాజకీయంగా ఓ ప్రత్యేక గుర్తింపు కలిగిన కుటుంబంతో పాటు వ్యాపార రంగంలో వైరా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో కొప్పురావూరి కుటుంబం తెలియని వారు లేరు. యువకుడైన కొప్పురావూరి సుమంత్ సతీమణి ప్రవళిక తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నారు.

### యడ్లపల్లి వనజ

యడ్లపల్లి వనజ యడ్లపల్లి వీరయ్య సతీమణి వనజ. గతంలో వైరా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. కష్టకాలంలోను పార్టీలో పోటీకి నిలిచిన కుటుంబం. ఆది నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న కుటుంబమే యడ్లపల్లి వీరయ్య చౌదరి కుటుంబం.

అయితే వార్డుల వారీగా పోట ఈచేసే వారి వివరాలు, పొత్తుల విషయంపై క్లారిటీ వచ్చిన తర్వాత ఎవరు ఏ వార్డు నుంచి పోటీ చేస్తారో అనేదానిపై స్పష్టత రానుంది. ఆ తర్వాత చైర్మన్ రేస్‌లో పోటీపడుతున్న అభ్యర్థులు ఏ వార్డు నుంచి పోట ఈచేస్తారని దానిపై కూడా పూర్తిస్థాయి సమాచారం రానుంది.

# అన్నారం - బెస్తగూడెం సిసి రోడ్డుకు శంకుస్థాపన



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం నుంచి బెస్తగూడెం వరకు సుమారు రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబోయే సిసి రోడ్డు పనులకు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మణుగూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నాణ్యమైన రహదారుల నిర్మాణంతో ప్రజలకు శాశ్వత సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఐవిఎన్ ప్రసాద్ గారు (ఏఈ), బిటి రామా రావు, కె. సత్య, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, గుత్తుల హరి కృష్ణ, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా , శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, పోలమూరి రాజు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్. గణేష్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి , 11వ వార్డు సభ్యులు జీవి, మాదాడి రాజేష్, పాతూరి వెంకన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐతనబోయిన సతీష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు, బత్తుల శ్రీను, గుండారపు వేణు కుమార్ , పల్లం నాగేశ్వరావు, బత్తుల శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలకు శ్రీకారం : పాయం



ప్రజాపక్షం/మణుగూరు: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇల్లు పథకం అమలులో భాగంగా మణుగూరు మండలం లోని శివాలయం కొత్త కొండపురం గ్రామంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు పిచ్చెట్టి అశ్విని కి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఐవిఎన్ ప్రసాద్ (ఏఈ), బిటీ రామా రావు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సైదులు, గుత్తుల హరి కృష్ణ , మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలమూరి రాజు, దొబ్బల వెంకటప్పయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్. గణేష్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి, 11వ వార్డు సభ్యులు మాదాడి రాజేష్, జీవి , పాతూరి వెంకన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐతనబోయిన సతీష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు

-చిన్నారులకు అక్షరాభ్యాసం.. గురువులకు సన్మానం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వసంత పంచమి సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాలలో సరస్వతి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు అక్షర్యాభ్యాసం చేశారు. గురువులకు సన్మానం చేశారు. మంగాపురతండా పాఠశాలలో ఉన్న సరస్వతి విగ్రహం కు పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో సరస్వతి విద్యాలయంలో గత 40 ఏళ్ల గా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన గురువు మాధవరావు ను వాసవి భక్త రామదాసు క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేగూరి హనుమంతరావు, దోసపాటి కల్పన, నాగుబండి శ్రీనివాసరావు, కొత్తా కరుణ, స్రవంతి, కళ్యాణి, శ్రీదేవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులు ఆర్థిక స్వాలంభన సాధించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పాడి రైతులు ఆర్థిక స్వాలంభన సాధించాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరు లో శుక్రవారం గోపామిత్ర ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిభిరం ను నిర్వహించారు. 34 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. 52 లేగ దూడలకు నట్టల నివారణ మందును త్రాగించారు. 15 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో గోపాలమిత్ర ద్వారా రైతుల ఇంటి వద్ద కు పశు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పాడి ద్వారా పాల దిగుబడితో రైతులు ఆర్థికంగా నిలబడాలని సూచించారు. గోపాలమిత్ర వైద్య సేవల నుసద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్.సాహిత్య, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డు సభ్యులు బొల్లగాని వెంకటరామారావు, రావెళ్ల జ్యోతిబస్సు, కోటేశ్వరరావు, అయోధ్య, రామయ్య, వల్లాల కృష్ణ, చంద్రం, ప్రణీత్, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026 సర్వే



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026లో భాగం గా అంతరం అడవి కౌలురు నార్త్ బీట్‌లో శుక్రవారం ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్నామని పినపాక ఎఫ్ఆర్ఓ తేజస్విని తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ స్లోత్ బేర్, బైసన్, సాంబార్ డీర్ తదితర వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన పాదముద్రలు, ఇతర సూచక గుర్తులు గుర్తించినట్లు ఎఫ్ఆర్వో తేజస్విని తెలిపారు. సర్వేలో భాగంగా ఫోటోలు సేకరించామని, వన్యప్రాణుల ఉనికి, నివాస పరిస్థితులపై సమగ్ర అధ్యయనం కొనసాగుతోందన్నారు. వన సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ఈ సర్వే కీలకమని అధికారులు పేర్కొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ప్రజాపక్షం/మణుగూరు: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే పాణాలు కాపాడుకోవచ్చని శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. రోడ్డు భద్రత ముగింపు మసోత్సవాల నేపథ్యంలో మణుగూరు కిన్నెర కళ్యాణమండపంలో నిర్వహించిన రోడ్డు భద్రత వాత్సవాల్లో శాసనసభ్యులు ప్రసంగిస్తూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రతి ఒక్కరూ ప్రాణాలు కాపాడుకోవచ్చునని శాసనసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సిఐ నాగ బాబు, ఎస్సై నగేష్ కుమార్, ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

## పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు



ప్రజాపక్షం/మణుగూరు: తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమ ఉండాలి. కానీ వేగంగా దూసుకుపోయే వాహనాలను వారికి కొని ఇచ్చి వారి ప్రాణాల కు దారి తీసే విధంగా ఉండకూడదని డీఎస్పీ రవీందర్ రెడ్డి సూచించారు. ఎక్కువ గా జనాభా రోడ్డు ప్రమాదాల వల్లే మృతి చెందుతున్నారు. భారతదేశంలో 2024లో 1,77,000 మంది మృతి చెందారు, తెలంగాణ రాష్ట్రంలో 7,280 మంది చనిపోయారు. ఈ ప్రమాదాలు యువత అతివేగంగా డ్రైవింగ్ చేయడం వలనే మృత్యువాత పడుతున్నారు. ఆటో డ్రైవర్, లారీ డ్రైవర్లు, మిగతా వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితమైన ప్రయాణం చేయవచ్చున్నారు డీఎస్పీ రవీందర్ రెడ్డి.

# మతోన్మాద ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలి

-ప్రగతిశీల సమాజ నిర్మాణానికి పోరాడండి
-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య
-పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభలు ప్రారంభం




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్ శక్తులు కలిసి అవలంభిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత నేటి విద్యార్థి, యువతపై ఉందని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) తెలంగాణరాష్ట్ర 23వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జెడ్పి సెంటర్ నుంచి మయూరిసెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య, మాస్‌లైన్ జిల్లా అధ్యక్షులు గోకినేపల్లి వెంకటేశ్వర్లు, పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అశోక్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోల తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను తమ గుప్పెట్లోకి తీసుకుని ప్రజాస్వామిక వాదులను, ప్రశ్నించే గొంతులను భయభ్రాంతులకు గురి చేస్తూ అణిచివేస్తున్నారన్నారు. 79 ఏళ్ల స్వాతంత్ర్య పాలనలో ప్రభుత్వాలు పార్లమెంటు, అసెంబ్లీలో చేసిన చట్టాలు, తీసుకు వచ్చిన




సంస్కరణలు పేద, మధ్యతరగతి వర్గాలకు నేటికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రశ్నించే గొంతులను అర్బన్ నక్సల్స్ పేరుతో జైలుపాలు చేస్తున్నారని, ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీ గిరిజనులను, అమాయకులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్య లు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో మతం ముసుగులో స్త్రీలపై దాడులు చేసిన వారిని , బ్యాంకులను కొల్లగొట్టిన వారికి బిజెపి ప్రభుత్వం రక్షణ కల్పించడం సిగ్గుచేటన్నారు. పాలకులు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత అమరుల పోరాట స్ఫూర్తితో పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహారావు, యర్రా అఖిల్ కుమార్, నరేందర్, గణేష్, సాయి, సురేష్, వి. వెంకటేష్, రాకేష్, మహేందర్, జెఎన్‌యు పిడిఎస్‌యు నేత తిరుపతి, లక్ష్మణ్, అంగిడి కుమార్, శివప్రశాంత్, అజయ్, కావ్య, అనూష, సీతారాం, నాగరాజు, సాయి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు బోదేపూడి విశ్వనాథం



ప్రజాపక్షం/ మధిర : బోదేపూడి విశ్వనాథం జీవితాన్ని ఈతరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన బోదేపూడి విశ్వనాథం సంతాప సభ రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం నాయకుడు రావిరాల లక్ష్మణరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, అలాంటి వృత్తికి విశ్వనాథం పూర్తి న్యాయం చేకూర్చారన్నారు. ఈ తరం ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఏ పాఠశాలలో పనిచేసినా అంకితభావంతో పనిచేసి అనేక మంది విద్యార్థులను ఉన్నతస్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దారన్నారు. ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారన్నారు పదవీ విరమణ తర్వాత కూడా మడుపల్లి ఉన్నత పాఠశాల నిర్మాణం తేళ్ల సుమోటో ట్రస్టు వారి సహకారంతో ఎంతో ఉన్నతంగా నిర్మించటం జరిగిందన్నారు. ఈ రోజు ఆ పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలవడలేని విశ్వనాథం కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం, సిఐటియు జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, జిల్లా అధ్యక్షులు షేక్.రంజాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పారుపల్లి వెంకటేశ్వరరావు, టిపిఆర్‌ఏ జిల్లా కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ మధిర : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపి రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఖమ్మం పార్లమెంటరీ టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్‌బాబు, పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు, వేమూరి సునీల్, రూరల్ అధ్యక్షులు మార్నీడీ పుల్లారావు, చెరుకూరి కృష్ణారావు, మేడా వెంకటేశ్వరరావు, అనుమోలు సతీష్, గద్దం మల్లికార్జునరావు, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, వాసిరెడ్డి ఉపేంద్ర, యడవల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మార్కెట్‌లో ఉద్రిక్తత

-మిర్చి ధర తగ్గిందంటూ రైతుల ఆందోళన
-రైతులకు నష్టం రానివ్వం : ఛైర్మన్ యరగర్ల





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వ్యాపారులు కుమ్మక్కై మిర్చి ధర తగ్గించారంటూ రైతులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే... శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి జెండా పాట రూ.20,100 పలికింది. ఆ తర్వాత మిర్చిని రూ. 15వేల నుంచి రూ.18వేలకు కొంటున్నారని రైతులు మార్కెట్ గేట్లకు తాళాలు వేసి ఆందోళనకు దిగారు. వ్యాపారులు కుమ్మక్కై ధరను జెండా పాటకు అనుగుణంగా కొనుగోలు చేయకుండా ధరను తగ్గించారని రైతులు ఆరోపించారు. గురువారం కొత్త మిర్చి జెండా పాట రూ.21,200 పలికింది. శుక్రవారం జెండా పాట రూ.1100లకు తక్కువగా రూ.20,100 పలికింది. దానికి అనుగుణంగా వ్యాపారులు కొనుగోలు చేయకుండా ఇష్టానుసారంగా మిర్చిని కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారని వాపోయారు. జెండా పాట కంటే ఐదువేలకు తక్కువగానే మిర్చి నాణ్యత ఉన్నా కొనుగోలు చేయడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు మార్కెట్ ప్రాంతానికి వచ్చి రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు ఆందోళన విరమించలేదు. మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ లు ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించమని జెండా పాటకు అనుగుణంగా మిర్చి కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే ముఖ్యమని చైర్మన్ తెలిపారు. వ్యాపారులతో కూడా మాట్లాడి ధర తగ్గించకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా మిర్చి కొనుగోళ్లు జరపాలని సూచించారు. దీనితో రైతులు ఆందోళన విరమించారు. మధ్యాహ్నం అనంతరం మిర్చి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగాయి.

# బంగారం దొంగతనం కేసులో ముగ్గురు మహిళలు అరెస్ట్




ప్రజాపక్షం/ మధిర : బంగారు దొంగతనం కేసులో ముగ్గురు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన మధిర టౌన్ సిఐ రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిన్న మధ్యాహ్నం సుమారు 1గంట సమయంలో అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న వెంకటరమణ జ్యూవలరీ షాపులో ముగ్గురు ఆడవారు వచ్చి చెవి జుంకాలు చూపించాలని అడిగి సదరు జ్యూవలరీ యజమానిని మాటల్లో పెట్టి రెండు చెవి జుంకాలు మోసపూరితంగా దొంగతనం చేశారు. దొంగతనం చేసిన ముగ్గురు మహిళలు చెవి జుంకాలను అమ్ముదామని శుక్రవారం మధిరకు రాగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ వారిని చూసి భయపడుతుండా వారిని ఎస్సై నవిత తనిఖీ చేయగా వారి దగ్గర అనుమానాస్పదంగా ఉన్న బంగారు చెవి జుంకాలను ఎవరివి అని విచారణ చేయగా అంబేద్కర్ సెంటర్‌లోని వెంకటరమణ జ్యూవలర్రీ దొంగతనం చేశామని నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారిని కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మధిర పట్టణంలోని బంగారు షాపుల యజమానులు నాణ్యమైన సీసీ కెమరాలు తమ షాపుల్లో, రోడ్డు సైడ్ కవర్ అయ్యే విధంగా అమర్చుకోవాలని, తరచూ సీసీ ఫుటేజీను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సై నవిత ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన భవనాల నిర్మాణానికి భూమి పూజ



ప్రజాపక్షం/వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చొరవతో రూ.3కోట్ల నిధులను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మంజూరు చేయడంతో నూతన భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులు గతంలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో ఇదే కళాశాలలో చదువుకున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను ఒప్పించి అదనపు తరగతి నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేయించానని భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రజాపాలనలో విద్యాభివృద్ధి కోసం గతంలో లేనివిధంగా హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించడం సంతోషం, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే వారు గతంలో అనేక ఇబ్బందులు పడ్డారని, తాను కూడా కటిక నేలపై పడుకొని చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కార్పొరేట్ కళాశాలల స్థాయికి దీటుగా వైరాలో రూ.200కోట్ల ఖర్చుతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ప్రారంభం కాబోతుందని ఆది వైరాకి తలమానికంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల పార్టీ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, విద్యా కమిటీ చైర్మన్ బుడిగె సునీత, పాలేటి నర్సింహారావు, దార్న రాజశేఖర్, పమ్మి అశోక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పీర్ల సావిడి వద్ద స్టీల్ రైలింగ్ ఏర్పాటు





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో పీర్ల సావిడి వద్ద ముస్లీం పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు ఫణితి సైదులు పాల్గొన్నారు. ముస్లీం పెద్దలకి ఇచ్చిన మాట ప్రకారం పీర్ల సావిడి జెండాల అరుగు వద్ద చుట్టూ స్టీల్ రైలింగ్‌ను ఫణితి సైదులు తన సొంత ఖర్చులతో నిర్మాణం చేయించారు. శుక్రవారం స్టీల్ రైలింగ్‌ను ముస్లీం పెద్దల ఆధ్వర్యంలో ఫణితి సైదులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు చెరుకూరి చలపతిరావు, పోటు మధు, పైడిపల్లి నాగేశ్వరరావు, సరిపూడి కోటేశ్వరరావు, దారా వెంకన్న, చెరుకూరి శ్రీను, ఫణితి వెంకటేశ్వర్లు, ఫణితి నాగార్జున, దారా అభిషేక్, జ్యోతిబాస్, ఫణితి బాబు శంకర్, ముస్లీం పెద్దలు షేక్ మౌలాలి, మస్తాన్, హిమాం, మదార్, యాకూబలి, పలువురు ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

# ఓ రామ నీనామమెంతో రుచిరా..



**- భద్రాచలంలో ప్రారంభమైన భక్త రామదాసు 393వ జయంతోత్సవాలు**
**- భక్తి శ్రద్దలతో నగర సంకీర్తన, శాస్త్రోక్త పూజలు**
**- తరలివచ్చిన వాగ్గేయకారులు**
**- రామనామ స్మరణతో మార్మోగుతున్న భద్రగిరి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఓ రామ నీనామమెంతో రుచిరా ... అంటూ భక్తరామదాసు శ్రీరామునిపై రచించి స్వయంగా ఆలపించిన నవరత్నాలను వాగ్గేయ కారులు లయబద్ధంగా ఆలపిస్తుంటే భద్రగిరి రామనామ సంకీర్తనలతో మార్మోగుతోంది. భక్తరామ దాసు 393వ జయంతిని పురస్కరించుకుని రామాలయం ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ప్రయుక్త వాగ్గేయ కారోత్సవాలు ప్రతీ ఏటా మాదిరిగానే ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి జ్యోతిప్రజ్వలన గావించిన అనంతరం స్వామికి పూలు, పండ్లు, ఫలాలు సమర్పించడంతో పాటు పంచ హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు దంపతులతో పాటు, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి దామోదర్ రావు దంపతులు, రామదాసు (కంచర్ల గోపన్న) 10వ తరం వారసుడు కంచర్ల శ్రీనివాస్‌తో పాటు అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి శిష్యులు మల్లాది సోదరులు, శ్రీనిధి, ఇతర సంగీత కళాకారులు పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన వారు ఏక కంఠంతో రామదాసు నవరత్న గీతాలాపనలు చేస్తుంటే ఆ ప్రాంతంలో భక్తిభావం తొనికసలాడింది. ఇందు కోసం రామాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తరామ దాసుతో పాటు ఇతర వాగ్గేయకారుల చిత్రపటాలతో వైభవంగా గిరి ప్రదిక్షణ జరిగింది. అదే విధంగా ఆలయంతో పాటు ఉత్తర ద్వార సమీపంలో ఉన్న రామదాసు విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి పూల మాలలు వేశారు. ముందుగా గోదావరి మాతకు పూజలు చేసి నూతనవస్త్రాలతోపాటు పసుపు, కుంకుమ సమర్పిమంచారు. ఇదిగో భద్రాద్రి... అదిగో గౌతమి చూడండీ అంటూ వాగ్గేయ కారులు లయబద్ధంగా ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు రామయ్యపై ఉన్న భక్తిని చాటుతూ భక్తరామదాసు, తూము నర్సింహదాసు, త్యాగయ్య, అన్నమయ్య తదితర వాగ్గేయ కారుల కీర్తలను ఆలపించారు.

### మార్మోగిన భద్రగిరి :

భక్తరామ దాసు జయంతిని పురస్కరించుకుని సాగిన రామనామ సంకీర్తనలతో భద్రగిరి మార్మోగింది. మేళతాళాలు, భజన బృంధాలతో సాగిన నగర సంకీర్తనకు రామభక్తులు పరవశించిపోయారు. భద్రాచలంలో రామాలయం నిర్మాణం చేసేందుకు రామదాసు చేసిన త్యాగం, ఆయన చెరసాల, స్వయంగా రామ లక్ష్మణులు వచ్చి తానీషాకు సొమ్ములు చెల్లించి రామదాసును విడివిపించడం వంటి సంభాషణలు భక్తుల మధ్య సాగాయి. తొలిరోజు వాగ్గేయ కారోత్సవాల సందర్భంగా భద్రాచలం పుర వీధుల్లో భక్తిభావం ఉట్టిపడింది.

# ఏజెన్సీలో దళారుల దందా..?



**-జోరుగా గిరిగిరి, ఫైనాన్స్**
**-చిరు వ్యాపారులు, మారుమూల ప్రజలే టార్గెట్**
**-రూ. పదికి పైనే వడ్డీ వసూళ్లు**
**-పట్టించుకోని అధికారులు**

**ప్రజాపక్షం/కరకగూడెం:** ఏజెన్సీ మండలమైన కరకగూడెంలో గిరిగిరి చిటీ, వారం వారం ఫైనాన్స్ వ్యాపారం. అధిక వడ్డీ వసూలు చేస్తూ అక్రమ సం పాదన మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగు తుంది. ఎలాంటి అనుమతి లేకుండానే ప్రతి వారం కొందరు వచ్చి మారుమూల గ్రామాల్లోని చిరు వ్యాపారులను అడ్డాగా చేసుకొని వారి ఆవాసాలనే ఆసరాగా మలుచుకొని వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలోని, భద్రాద్రి జిల్లా పరిధిలోని మణుగూరుతో పాటు ఆయా ప్రాంతాల నుంచి కొందరు ఇక్కడ ఏజెంట్లతో వడ్డీ వ్యాపారం సాగిస్తు న్నారు. ఏజెన్సీలో ఎలాంటి వ్యాపారం చేయాలన్న 1/70 చట్టానికి లోబడి ఉండాలన్న నిబంధనలు ఉన్నాయి. చట్టవిరుద్ధమని నిబంధనలు ఉన్నా అధికారులు కట్టడి చేయడం లేదని మండలంలో ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### రూ.10కి పైనే వడ్డీ..

మండల కేంద్రానికి ఇతర ప్రాంతాలైన పినపాక, సీతంపేట, మణుగూరు, ఆంధ్ర నుండి నుంచి కొందరు వచ్చి వడ్డీ వ్యాపారాన్ని మొదలుపెట్టారు. ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని మండలంలోని చిరువ్యాపారులను ఆసరాగా చేసు కొని గిరిగిరి, ఫైనాన్స్ చిటీల రూపంలో అక్రమంగా సంపాదిస్తున్నారు. రూ.1,000 నుంచి మొదలు రూ.50వేల వరకు ఇస్తూ రూ.10నుంచి రూ.20 మధ్యలో వడ్డీ వసూలు చేస్తుంటారు. తెల్లారక ముందే గ్రామాల్లో వాలి వారం వారం వసూలు చేసుకొని అధిక వడ్డీలు వేసి బాధితుల నడ్డి విరుస్తు న్నారు. అధికారులు వారిపై దృష్టి సారించక పోవ డంతో పలు విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫైనాన్స్ వడ్డీ వ్యాపారాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు

### ఏ గ్రామాన్నీ వదలిపెట్టరు..

మండలంలోని కలవాల నాగారం, బట్టుపల్లి, కరకగూడెం, తాటి గూడెం, మోతే పద్మాపురం, బర్లగూడెం, అనంతారం, గొల్లగూడెం, చొప్పాల వరకు ఉన్న అన్ని గ్రామాల్లో చిరువ్యాపారులు, వ్యవసాయ రైతుల అవసరాలను పసిగడతారు. సుమారు 10 పైగా దళారులు ఆంధ్రప్రదేశ్ నుంచి వారం రోజులపాటు దర్జాగా నగదు వడ్డీ వసూలు చేసుకొని పోతుంటున్నారు. ఎవరైనా అడ్డు చెబితే ఎవరి చెప్పుకుంటావో చెప్పుకో.. తమకు అందరూ తెలుసు అంటూ దబాయిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం : ఏడుళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు



అనుమతి లేకుండా గ్రామా ల్లో గిరిగిరి దందా చేస్తున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలనుంచి అధిక వడ్డీలు వసూలు చేసి ఇబ్బందులు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదు. ఫైనాన్స్ వ్యాపారం సాగిస్తున్న వ్యక్తులు కనబడితే తమ దృష్టికి తీసుకురావాలి.

### అధికారులే అరికట్టాలి : దుర్గం ప్రేమ్ కుమార్, ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మండలంలో చాలామంది వారం వారం వచ్చి డబ్బు లు వసూలు చేసుకొని పోతుంటారు. ఒక వారం డబ్బులు కట్టకుంటే వారిని తిట్టి మళ్లా వారం వరకు ఇవ్వకుంటే బాగుండదంటూ బెదిరిస్తారు. అధికారులు స్పందించి వీరిని అరికట్టాలి.

## సమ్మక్క సారక్క జాతర ప్రారంభం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధి లోని ఎర్రబోడు గ్రామం నందు నిర్వ హించిన సమ్మక్క సారక్క జాతరను వైరా మాజీ ఎంఎల్‌ఏ లావుడియా రాములు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పూజారులు ఘనంగా మేళ తాళాలతో స్వాగతం పలికారు. అనంతరం పూజా రులతో కోయ నృత్యం చేశారు. వైరా నియోజకవర్గ ప్రజలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాల తో జీవించాలని ఆ వనదేవతలను గద్దెల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకులు ఆడప పుల్లారావు నివాసంలో తేనేరును స్వీకరించారు. ఈకార్యక్రమంలో సర్పంచులు భూక్యా పద్మా, ఈసాల అలివేలు మంగ, మాజీ సొసైటీ ఛైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, మాజీ సర్పంచులు కురసం సత్యనారాయణ, భూక్యా సైదా, నాయకులు అజ్మీర వీరన్న, భూక్యా రామ్ కిషోర్, వాంకుడోత్ విజయ్, ఈదర కోటేశ్వరరావు, కాటేపల్లి నవీన్, ఈదర చలపతి, చాందిని, భూక్యా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ కోసం సర్పంచ్‌కు విద్యార్థుల వినతి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పొగలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాటశా లకు ప్రహరీ గోడను మంజూ రు చేయాలని కోరుతూ నెహ్రూ బాలసభ సభ్యులు శుక్రవారం పొగళ్లపల్లి సర్పం చి మడకం రవికి వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో చాలా నిర్మించిన మరుగుదొడ్లు వినియోగించే విధంగా లేదని, ప్రహరీ గోడ లేని కారణంగా ఆకతాయిలు పాఠశాల ఆవరణను అపరిశుభ్రం చేయడంతో పాటు వర్షాకాల సమయంలో పొలాలు వెళ్లే ట్రాక్టర్లు సైతం స్కూల్ ఆవరణ నుండి వెళ్తుండటంతో ఆటస్థలం ధ్వంసం అవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అవసరాలకు వినియోగించే విద్యుత్ స్తంభం పాఠశాల గ్రౌండ్ మధ్యలో ఉండటంతో ఆటలు ఆడుకునేందుకు సైతం ఇబ్బందిగా తయారైందని ఈసందర్భంగా సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ రవి సమస్య పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఎక్సలెంట్ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** జ్ఞానం హక్కు విద్య మొద లైన శక్తులే సరస్వతి మాత అని ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ లెనిన్ విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం అశ్వాపురంలోని ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశా లలో సామూహిక అక్షరా భ్యాస కార్యక్రమాన్ని ప్రిన్సి పాల్ లెనిన్ విజయ్ కుమార్ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వసంత పంచమి వేడుకల్లో పండితుల మంత్రోచ్చారణల మధ్య తల్లిదండ్రులు చిన్నారులు భక్తిశ్ర ద్ధలతో అక్షరాభ్యాసం నిర్వహించామని మండలంలోని అన్ని గ్రామాల నుండి తల్లిదండ్రులు అత్యధికంగా పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమా అనంతరం నూతనంగా చేరిన విద్యార్థినీ విద్యార్థులకు పలకలు, పుస్తకాలు బహుకరించారు. ఈకార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యా యినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ చంద్రబోస్ త్యాగం మరవలేనిది



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సుభాష్ చంద్రబోస్ త్యాగం మరవలేనిదని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రం లో శుక్రవారం బోస్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూల మాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన చేసిన పోరాటాలను వివరించారు. గొప్ప దేశభక్తుడన్నారు. స్వాతంత్ర పోరాటాలు ఆయన జీవితం త్యాగం ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు. ఆయన సేవలు దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, కల్యాణం నాగేశ్వరరావు, సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, తొ గాటి నాగాచారీ, పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండానే కార్మికులకు అండ



**- అనేక పోరాటాలతోనే కార్మికులకు ప్రయోజనాలు**
**- ప్రభుత్వాల తీరుతో సింగరేణి ఆర్థిక సంక్షోభంలోకి**
**- ఎంఎల్ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఎర్రజెండాతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని, ఆ నాటి నుండి నేటి వరకు సిపిఐ మద్దతుతో ఏఐటియూసీ కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించేందుకు పాటుపడిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. శుక్రవారం స్థానిక శేషగిరి భవన్‌లో జరిగిన పివికే 5 ఫిట్ కమిటీ సమావేశానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడారు. మెడికల్ బోర్డు కోసం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని నిలదీశానని, కార్మికుల సొంతింటి కల నిజం చేసేంపకు ప్రభుత్వానికి ఎప్పటికి కప్పుడు వినతులు అందిస్తున్నాని చెప్పారు. కార్మికుల ఇన్‌కంటాక్స్ షేర్‌ను సంస్థే భరించాసే ఒత్తడి తెస్తున్నామని, కార్మిక వర్గ పోరాటాలు చేసి మనం దానిని సాధించాలన్నారు. ఏటేటే పర్మినెంట్ కార్మి కులను తగ్గిస్తూ నూతన ఉద్యోగాలు కల్పించకుండా అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులను చేర్చుకుంటున్నారని, దీనిని అడ్డుకుని తీరుతామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వారి శ్రమను సింగరేణి సంస్థ దోచు కుంటోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రానున్న రోజుల్లో సింగరేణి తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోనుందని, సంస్థ భవిష్యత్, కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా ఏఐటియూసి ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు ముందుండాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు పాటుపడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి మల్లిఖార్జున్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, సందెబోయిన శ్రీనివాస్, మధు, కృష్ణ, శ్రీనివాస్ కమల్, భూక్య రమేష్, సాయి పవన్ కుమారరావు, వెంకట రమణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఖమ్మంలో ఉమెన్ క్రికెట్ టోర్నమెంట్



**-ఎనిమిది రాష్ట్రాల నుంచి హాజరుకానున్న మహిళా క్రికెటర్లు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 25 నుంచి ఖమ్మంలో జాతీయ స్థాయి ఇందిరాగాంధీ ఐదవ సీనియర్ ఉమెన్ టి20 క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, టోర్నమెంట్ నిర్వాహకుడు మహ్మద్ మతిన్, ఆలిండియా ఉమెన్ టి20 క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్ సందీప్ ఆర్యాలు తెలిపారు. శుక్రవారం సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ఎస్ఆర్ అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు దాతలు ముందుకు రావడం శుభసూచకమన్నారు. ఈ పోటీలకు ఎనిమిది రాష్ట్రాల నుంచి సీనియర్ మహిళా క్రికెటర్లు పాల్గొంటారని తెలిపారు. వైద్యులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్ జిల్లాలో జరగడం అభినందనీయమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలన్నారు. మహ్మద్ మథిన్ నేతృత్వంలో ఈ పోటీలు విజయవంతం కావాలని కోరారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

# ఓటు హక్కు వజ్రాయుధం : కలెక్టర్



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైందని, వజ్రాయుధమని, 18 సం. నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు వేసేందుకు అర్హులని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సంజీవరావు, మహిళా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, బిసి సంక్షేమాధికారి విజయలక్ష్మి, ఏఓ అనంత రామకృష్ణ, ఎన్నికల సూపరింటెండెంట్ రంగా ప్ రసాద్, అన్ని శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది నవీన్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో :** కొత్తగూడెం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో కమీషర్ సుజాతతో పాటు సుజాతనగర్, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల తహశిల్దార్లు, సిబ్బంది, సిపిఐ నాయకులు, షాబీముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల కోసం వచ్చిన లబ్ధిదారులు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# 45 కిలోల గంజాయి పట్టివేత

**- రూ. 20 లక్షల విలువ**
**- ఐదుగురు నిండితుల అరెస్ట్**




**ప్రజాపక్షం/పాల్వంచ :** గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను పాల్వంచ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొన్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా డిఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే. సుమన్ తన సిబ్బందితో గురువారం రాత్రి పాల్వంచ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాగులు పట్టుకొని ఉన్న ఐదుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని తనిఖీ చేయగా వారి వద్దనున్న బ్యాగులలో గంజాయి ఉందని తెలిసింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా 1, తమిళనాడు (చెన్నై) కు చెందిన ఝూన్సీ అయ్యప్పన్, 2, ధనలక్ష్మి, 3, వనితా గణేష్, 4, వలియమ్మ షణ్ముగమ్, 5 శ్రీనివాసన్ మనికండన్ అను ఐదుగురు కలిసి సులువుగా డబ్బు సంపాధించటానికి భద్రాచలం లో శ్రీను అను వ్యక్తి దగ్గర నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు సరఫరా చేయటానికి భద్రాచలం నుండి పాల్వంచకు చేరుకొన్నారు. ఇక్కడ నుండి జంగారెడ్డిగూడెం వెళ్ళుటకు వేచి చూస్తున్నారని తెలిసింది. వీరి వద్ద నుండి 42 కిలోల గంజాయి, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నారు. ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. చెన్నైకి చెందిన నరేందర్, విజయవాడకు చెందిన శ్రీను అనే ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో సిఐ. సతీష్, ఎస్ఐ కే. సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో ఉప సర్పంచ్ బొల్లినేని గణేష్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణేష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఎవరో ఇచ్చేది కాదు పోరాటంతోనే సాధించుకోవాలని బలంగా నమ్మి ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించిన స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశ భక్తి ధైర్యం, పోరాట పటిమ, క్రమ శిక్షణే ఆయన జీవన విధానం, నేతాజీ చూపిన పోరాట మార్గం నేటికీ ఆదర్శనీయమని అన్నారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు రాసాల రామయ్య, రాసాల కొమరయ్య, తోట సత్యనారాయణ, పోతురాజు మూత్తయ్య, రాసాల రమేష్, దోసపాటి చింటూ, మునుకోటి ప్రమీల, జటంగి నగేష్, గజ్జి లోహిత్, డిస్ రవి, జెట్టి మధు, జక్కుల మనోజ్, బత్తుల నాగరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కూసుమంచి :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ 43వ జన్మదిన వేడుకలను కూసుమంచి మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం టీడీపీ అభిమానులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు మందపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నలగాటి రామనాథం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకంటే ముందు బస్టాండ్ సర్కిల్ ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వం వర్థిల్లాలి, తెలుగుదేశం జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, వజ్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంటూరి నాగరాజ్ చౌదరి, జిల్లా నాయకులు గోపి వెంకన ఉపాధ్యక్షులు శివ, తెలుగు యువత అధ్యక్షులు తుళ్లూరి భాస్కరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోవింద్ ఎల్లయ్య, జూనియర్ ఎన్టీఆర్ మండల శాఖ అధ్యక్షులు ఐతగాని నవీన్ కుమార్, నలగాటి స్వామి, మైనారిటీ నాయకులు షేక్ దస్తగిరి, టీడీపీ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ఓటరు ప్రతిజ్ఞ



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** స్థానిక జిల్లా గ్రంధాలయంలో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యదర్శి కరుణకుమారి, గ్రంధపాలకురాలు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దని, ఓటు వజ్రాయుధం వంటిదని అన్నారు. ప్రశాంత వాతావరణంలో రాజ్యాంగ మనకు కల్పించిన ఓటును హక్కుగా భావించి అంతా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్ధిని విద్యార్థులతో పాటు గ్రంధలాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** కల్లూరు మండల పరిధిలోని లింగాల సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పై ఓబుల్ రావు బంజర్, ముచ్చవరం సమీపంలో శుక్రవారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ ఏలూరు జిల్లా కు చెందిన కొమ్ము సాయి మహేష్ (35) గట్టు రాంబాబు (39 )సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ నుండి ఖమ్మం వైపు వెళ్తుండగా అతివేగంతో రైలింగును ఢీకొనటంతో తలకు శరీర భాగాలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. అదే సమయంలో 108 సిబ్బంది అక్కడకు చేరుకొని పరీక్షలు చేయగా మృతి చెందినట్లు నిర్ధారించారు. భౌతిక దేహాలను పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కల్లూర్ ఎస్ఐ డి హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా సుభాస్ చంద్రబోస్ జయంతి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాస్ చంద్రబోస్ 130వ, జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సోమరాజుదొర చేతుల మీదుగా రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు, వాటర్ బాటిల్స్ అందజేశారు. అనంతరం సోమరాజు దొర మాట్లాడుతూ నేతాజీ యువజన సంఘం చేస్తున్న సేవల అభినందనీయమన్నారు. రాబోయే రోజులో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు నామా బుచ్చయ్య, నాయకులు బుడగం నాగేశ్వరరావు, భార్గవ్ సాయి, దేవీలాల్ నాయక్, రోషయ్య చౌదరి, ముగిది శ్రీరామ్, పి. ప్రసాద్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌జేకే. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.